

## ఉపాధ్యాయులందరికీ జీతాలు జమ : డిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బందికి సంబంధించి మొత్తం 227 మంది డిడిఓ అధికారులు ఉన్నారని, జిల్లాలో ఈ నెల నాలుగో తేదీ నాటికి 189 మంది డిడిఒలు జీతాల బిల్లులను ఆన్‌లైన్‌లో సమర్పించడంతో జీతాలు జమయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మిగిలిన వారి వారిలో పొజిషన్ ఐడి అనే సాంకేతిక సమస్య రావడం కారణంగా సెప్టెంబర్ 4న జీతం బిల్ సమర్పించలేకపోయారని, పొజిషన్ ఐడి సమస్యను డిఇఒ కార్యాలయం వారు సిఎస్‌ఇ వారి సహకారంతో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ వారితో మిగిలిన వారికి పొజిషన్ ఐడిని ఈ నెల ఏడో తేదీన అందించామని పేర్కొన్నారు. మిగిలిన వారు కూడా ఈ నెల 7న జీతం బిల్లు ఆన్‌లైన్‌లో సమర్పించారని తెలిపారు. దీంతో జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది అందరికీ జీతాలు పడినట్లు డిఇఒ పేర్కొన్నారు.

పాలకొల్లులో కిందపడిన నిమ్మల, అంగరతో చర్చిస్తున్న డిఎస్‌పి

# చంద్రబాబు అరెస్టుపై.. హైటెన్షన్..!

- ★ భగ్గుమన్న టిడిపి శ్రేణులు
- ★ టిడిపి నేతల గృహనిర్బంధాలు.. అరెస్టులతో ఉద్రిక్తత
- ★ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, ఎంపీలు సైతం అరెస్టు
- ★ రోడ్డెక్కిన తమ్ముళ్లు.. ధర్నాలు, ఆందోళనలు
- ★ డిపోలకే పరిమితమైన ఆర్‌టిసి బస్సులు
- ★ ప్రయివేటు వాహనాల దోపిడీతో జనం బెంబేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో శనివారం ఉదయం నుంచి జిల్లాలో హైటెన్షన్ నెలకొంది. పోలీసులు ముందస్తుగా తెల్లవారుజాము నుంచే టిడిపి ప్రధాన నేతలను గృహ నిర్బంధం చేశారు. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజును ఇంటి వద్ద గృహ నిర్బంధం చేయగా అక్కడే నేతలు నిరసన తెలిపారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటిని అరెస్టు చేసి ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రధాన సెంటర్లలో పోలీస్ పికెట్లు కొనసాగాయి. టిడిపి అనుకూలురు కన్పిస్తే పోలీసులు లాఠీలతో చెదరగొట్టే పనిలో పడ్డారు. ఎక్కడికక్కడే పోలీసులు మోహరించారు. ఆందోళనలు, నిరసనలు జరగకుండా నిరోధించేందుకు ప్రయత్నం చేశారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పెనుబోయిన మహేష్‌యాదవ్‌లతోపాటు పలువురు నేతలు ఏలూరు ఓవర్‌బ్రిడ్జిపై నిరసన తెలపగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వసంత మహల్ సెంటర్, ఆర్‌ఆర్‌పేటలోనూ టిడిపి నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. పలుచోట్ల టిడిపి నాయకులు వ్యాపార దుకాణాలు మూయించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పట్టణాలు, పల్లెల్లోనూ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. జంగారెడ్డిగూడెంలో టిడిపి నేతలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. చింతలపూడిలోనూ పలు మండల కేంద్రాల్లో టిడిపి నాయకుల ర్యాలీలు ఆందోళనలు సాగాయి. జగన్ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్ట్ చేశారంటూ టిడిపి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబును అరెస్టు చేయడంపై పలు రకాలుగా విశ్లేషణలు సాగాయి. బెయిల్ రాకుండా చేసేందుకే శని, ఆదివారాలు చూసుకుని అరెస్టు చేశారనే చర్చలు సాగాయి. చంద్రబాబు అరెస్ట్ రాజకీయంగా జిల్లాలో సంచలనం రేపింది.

**సామాన్య ప్రజానీకం ఇబ్బందులు వర్ణనాతీతం**

చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఆర్‌టిసి బస్సులను డిపోలకే పరిమితం చేశారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ బస్సులు రోడ్డెక్కలేదు. ప్రయివేటు బస్సులను సైతం నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు బయలుదేరిన ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 650 వరకూ ఆర్‌టిసి బస్సులు ఉండగా మొత్తం డిపోలకే పరిమితమయ్యాయి. ఇదే అదునుగా ప్రయివేటు వాహనదారులు ప్రయాణికులను దోపిడీ చేశారు. ఏలూరు నుంచి విజయవాడ వెళ్లేందుకు రూ.250 నుంచి రూ.400 వసూలు చేశారు. 15 కిలోమీటర్లలో ఉన్న హనుమాన్ జంక్షన్‌కు వెళ్లడానికి రూ.వంద వసూలు చేశారు. దీంతో ప్రయాణికులు లబోదిబోమన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఆర్‌టిసి బస్సులను ఆపేయడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గమ్యస్థానాలకు చేరేందుకు నరకయాతన అనుభవించారు.

ఖాళీగా ఉన్న ఏలూరు బస్టాండ్

ఏలూరులో మాగంటి బాబు, బడేటి చంటిలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నీటి మట్టం తగ్గిన కాలువ..

# వీడని సాగునీటి కొరత

## వంతుల వారీ విధానంలోనూ అందని నీరు
## చేలు బీటలు వారడంతో రైతులు గగ్గోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సాగులో రైతులకు సాగునీటి వెతలు తప్పడం లేదు. ఈ ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. మొన్నటి వరకు వర్షాల వల్ల వచ్చిన అధిక నీటిని అధికారులు సముద్రంలో వదిలేయగా, ప్రస్తుతం కృష్ణానదిలో నీటి నిల్వలు తగ్గాయి. దీంతో పంటకాల్వలకు పూర్తిస్థాయిలో అధికారులు నీటిని విడుదల చేయడం లేదు. దీంతో మండలంలో సాగునీటి ఎద్దడి మొదలైంది.

మండల జలవనరుల శాఖాధికారులు పంట కాల్వలకు నీటి విడుదలలో వంతుల వారీ విధానం అమల్లోకి తెచ్చారు. దీంతో మండలంలో ప్రధాన పంట కాల్వలైన పోల్‌రాజ్ కెనాల్, క్యాప్‌బెల్ పంట కాల్వలకు వంతులవారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఒక్కో కాల్వకు ఐదు రోజుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ బ్రాంచి కాల్వలకు నీరందని పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లోని గురువు భూముల్లో ఎండిపోతున్న వరిపైరుకు నీరందడం లేదు. వంతుల వారీ విధానంలో నీటిని విడుదల చేయడం వల్ల క్యాంప్‌బెల్, పోల్‌రాజ్ కాలువల ఆయుకట్టు పరిధిలో పలు గ్రామాల్లోని గురువు నేలలకు నీటి ఎద్దడి ఏర్పడి, వరిసాగుకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని కౌలు రైతులు చెబుతున్నారు. మండలంలో అడపా దడపా కురుస్తున్న వర్షాలు ప్రస్తుతం వరిపైరుకు ఉపయోగకరంగా ఉంది. వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నా, వంతు ప్రకారం నీరు పూర్తిస్థాయిలో దిగువకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఆక్వా రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడేస్తున్నారని వరి రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్య, వ్యవసాయశాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో శివారు మెరక భూములకు సాగునీటి ఎద్దడి నెలకొంది. వంతుల వారీగా వచ్చే నీటిని ఆక్వారైతులు చేపలు, రొయ్యల చెరువులకు మళ్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శివారు భూములకు సాగునీటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

## నిరసనకారులపై పోలీసు జులుం
## పలు చోట్ల అరెస్టులు, గృహనిర్బంధం

ప్రజాశక్తి - భీమడోలు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్నివీరాంజనేయులును భీమడోలులోని ఆయన నివాసంలో పోలీసులు శనివారం గృహనిర్బంధం చేశారు. చంద్రబాబు అరెస్టు, గన్ని వీరాంజనేయులు గృహనిర్బంధం పురస్కరించుకొని టిడిపి శ్రేణులు భీమడోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత భీమడోలు సంతపేటలోని అంబేద్కర్ విగ్రహం, ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద నుంచి గన్నికి సంఘీభావం తెలిపేందుకు టిడిపి శ్రేణులు గన్ని వీరాంజనేయులు నివాస గృహానికి చేరుకున్నారు. అప్పటికే గృహ నిర్బంధంలో ఉన్న గన్ని వీరాంజనేయులు తనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన టిడిపి శ్రేణులను కలిసే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీనికి నిరసనగా గన్ని నివాస గృహం గేటు వద్ద కూర్చుని నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు.

**ద్వారకా తిరుమల :** చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ద్వారకాతిరుమలలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో మండల బిసి సెల్ అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు లంకా సత్యనారాయణ, ఇమ్మడి రత్నాజీ, కార్యకర్తలు, నాయకులు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. పోలీసులు నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**బుట్టాయగూడెం :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేసినందుకు నిరసన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. బుట్టాయగూడెం గద్దె అబ్బులు నివాసం నుంచి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ నిరసన ర్యాలీ కింద బయలుదేరిన 25 మందిని బుట్టాయగూడెం పోలీసులు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, నియోజవర్గ రైతు కార్యదర్శి అబ్బులు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, బుట్టాయగూడెం ఉపసర్పంచి కుందుల శ్రీను, ఆండ్రు శ్యామ్ కుమార్, దెయ్యాల కృష్ణమోహన్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు వరక కృష్ణంరాజు, బొబ్బిర ఏలీసా, పసుమర్తి భీమేశ్వరరావు, చిలకమూడి సుధాకర్, బాడిన ముత్యాలరావు, చోడే అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో నిరసనకారులని అరెస్టు చేస్తున్న పోలీసులు

జీలుగుమిల్లిలో నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

భీమడోలులో హౌస్ అరెస్టుకు సంఘీభావంగా..

బుట్టాయగూడెంలో హౌస్ అరెస్టులో నేతలు

జంగారెడ్డిగూడెంలో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తూ..

చాట్రాయిలో సిఎం దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న నిరసనకారులు

## చంద్రబాబు అరెస్టును ఖండించిన సిపిఎం

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును గత అర్థరాత్రి నంద్యాలలో ఆయన ఇంటిపై దాడి చేసి, జనాన్ని భయభ్రాంతులకు గురిచేసి తెల్లవారుజామున అరెస్టు చేసిన తీరును సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు అభ్యంతరకరంగా ఉందని అన్నారు. ఈ అరెస్టును సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. చంద్రబాబును తక్షణమే విడుదల చేసి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా విచారించాలని రవి కోరారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన టిడిపి కార్యకర్తలను జిల్లా వ్యాప్తంగా గృహనిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ అరెస్టులను సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తుందని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని రవి కోరారు.

# ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ఆర్‌డిఒగా నియమితులైన ఖాజావలీ నర్సాపురం ఎస్‌కె శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్న ఖాజావలికి తహశీల్దార్ బి.సోమశేఖర్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. వీరితో పాటు కార్యాలయ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈయన గతంలో మచిలీపట్నం ఆర్‌డిఒగా పనిచేశారు. ఆపై ముఖ్యమంత్రి కార్యదర్శి వద్ద ఒఎస్‌డిగా పని చేశారు. అక్కడ నుంచి బదిలీపై ఏలూరు ఆర్‌డిఒగా నియమితులయ్యారు.

# ముంపులో ఎద్దువాగు వంతెన

## పరిశీలించిన ఆర్‌డిఒ ఝాన్సీరాణి

ప్రజాశక్తి - వేలేరుపాడు

గోదావరి వరద ఉధృతి కారణంగా మండలంలో యడవల్లి, కట్కూరు గ్రామాల మధ్య నీట మునిగిన ఎద్దువాగు వంతెనను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, తహశీల్దార్ జి.ఎలీషా శనివారం పరిశీలించారు. రెండు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి నీటి పవాహం 29 అడుగుల మేర ఉండడంతో ఎద్దువాగు వంతెన సుమారు నాలుగు అడుగులు పైబడి నీట మునిగింది. దీంతో ఈ వంతెనపై నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గినప్పటికి రాకపోకలకు అనువుగా లేదని ఆర్‌డిఒ ఝాన్సీరాణి తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అత్యవసర పరిస్థితుల్లో వెళ్లేందుకు ఒక మోటార్ బోటును ఏర్పాటు చేశామన్నారు. సదరు వంతెన వద్ద ఉదయం ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకూ రెవెన్యూ సచివాలయ సిబ్బంది రెండు షిఫ్ట్‌ల్లో పని చేస్తామరని ఆమె తెలిపారు.

# నిలిచిపోయిన బస్సులు

## ప్రయాణికుల ఇబ్బందులు

**ఏలూరు అర్బన్ :** చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందస్తు ఆంక్షలులో భాగంగా ఆర్‌టిసి బస్సులను పూర్తిగా రద్దుచేసి డిపోలకే పరిమితం చేయటంతో, ఏలూరు బస్టాండ్‌లో బస్సులన్నీ నిలిచిపోయాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లవలసిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు నిలిచిపోయిన విషయం తెలియక బస్టాండ్‌కు చేరుకున్న అనేక మంది ప్రయాణికులు గత్యంతరం లేక ప్రత్యామ్నాయంగా ప్రెయివేటు వాహనాలను ఎంచుకున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రెయివేటు వాహనదారులు విపరీతమైన ధరలతో ప్రయాణికులను దోచుకున్నారు. ఆర్‌టిసి బస్సులో విజయవాడకు బస్సును బట్టి రూ.100 నుంచి రూ.150 వరకూ ఉండగా, కారులో విజయవాడకు రూ.250 నుంచి రూ.400 వరకూ వసూలు చేశారు. దీంతో గత్యంతరం లేని ప్రయాణికులు అంత డబ్బు చెల్లించి ప్రెయివేటు వాహనాల్లో తమ గమ్యానికి చేరుకున్నారు.

విరాళాల సేకరణలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు

# పోరాటాలకు సహకరించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసే సిపిఎం పార్టీ ఉద్యమ అవసరాలకు ప్రజలు మద్దతుగా నిలవాలని, విరివిగా విరాళాలు అందించి ప్రోత్సహించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. సెప్టెంబర్ 23, 24, 25, 26 తేదీల్లో 4 రోజుల పాటు రాష్ట్రస్థాయి సమావేశాలు ఏలూరులో జరుగుతున్నాయని, వీటికి 500 మంది వరకూ ప్రతినిధులు హాజరవుతారన్నారు. వారందరికి భోజన, వసతి సౌకర్యాలు, కార్యక్రమాల నిర్వహణ, భవిష్యత్ ఉద్యమాలకు ప్రజలు సహాయ, సహకారాలు అందిచాలని రవి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగానే ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో ఏలూరులో ఇంటింటికీ తిరిగి నిధి వసూలు చేసే కార్యక్రమం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏలూరు పట్టణంలో సొంతిల్లు లేని పేదలను సమీకరించి కుమ్మరిరేవు, దక్షిణపువీధి, బావిశెట్టిపేట, వెంకటాపురం, శనివారపుపేట, తంగెళ్ళమూడి తదితర ప్రాంతాల్లో 2 వేల మందికి ఇళ్ల స్థలాలు సాధించి పెట్టామని తెలిపారు. దొండపాడు వక్ఫ్ బోర్డు భూములు మైనార్టీ పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఎం పోరాడిందన్నారు. ప్రజలకు తాగునీరు అందించే పంపుల చెరువును, పిల్లలకు విద్యను అందించే సుబ్బమ్మదేవి హైస్కూలు గ్రౌండ్ వంటి ప్రజా ఆస్తులు అమ్ముకోవాలని చూస్తే అఖిలపక్ష సంఘాలను కూడగట్టి పోరాడి ఆపిందని గుర్తు చేశారు. ఆందోళనలు చేసి తమ్మిలేరుపై బాలయోగి వంతెన, పోణంగి, కొత్తూరు, శనివారపు పేట కాజ్వేల కోసం పోరాడి కొత్తూరు, పోణంగి వంతెనలు నిర్మించేలా చేసిందన్నారు. కరోనా సమయంలో సిపిఎం తన ఆఫీసులనే ఐసోలేషన్ సెంటర్లుగా నడిపి, కరోనా పేషెంట్లను అక్కున చేర్చుకుందన్నారు. ఇందిరమ్మ కాలనీలు, మురికి వాడలలో రోడ్లు, డ్రెయిన్లు, కనీస సౌకర్యాల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. రైతులు, కార్మికులు, చేతివృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, వికలాంగులు, దళితులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలు తదితర ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతోంది. అందుకే సిపిఎం పార్టీగా ఉద్యమ అవసరాలకు ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు ఇంటింటికీ వస్తున్నామని, మా బృందాలకు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించాలని రవి విజ్ఞప్తి చేశారు.

# యాత్రలు.. దాడులు..!




**యువగళం పాదయాత్ర, ఉద్రిక్త ఘటనలతో జిల్లా రాజకీయం మరింత వేడెక్కింది. అధిక ధరలు, నిరుద్యోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం నిర్వహించిన సమరభేరీ ప్రజల్లో చర్చనీయాంశమైంది.**

యువగళం పాదయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం రాత్రితో ముగిసింది. ఆగస్టు 24వ తేదీ రాత్రికి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో ప్రవేశించిన యాత్ర ఉమ్మడి జిల్లాలో 15 రోజులపాటు ఎనిమిది నియోజకవర్గాల మీదుగా సాగింది. యాత్రకు జన స్పందన బాగానే ఉందని విశ్లేషకుల అంచనా. రూట్‌మ్యాప్ ముందుగా ఖరారు కాకపోవడం ఒక లోపంగా ఉండగా పార్టీలోని గ్రూపులు మాత్రం పోటాపోటీగా జన సమీకరణకు దిగడం యాత్రకు ఊపునిచ్చిందని చెప్పొచ్చు. నూజివీడు మండలం తుక్కులూరు, నిడమర్రు మండలం మందలపర్రుల్లో యాత్ర సందర్భంగా టిడిపి, వైసిపి శ్రేణుల నడుమ ఘర్షణ చోటుచేసుకున్నా కొద్దిసేపటికే సమసిపోయాయి. అయితే భీమవరంలో చోటుచేసుకున్న ఘటన మాత్రం చర్చనీయాంశం కావడంతోపాటు అరెస్టులకు దారితీసింది. ఒకవిధంగా చెప్పాలంటే ఈ ఘర్షణ పోలీసుల ప్రతిష్టను బజారున పడేసిందనే చెప్పాలి. భీమవరం సభలో లోకేష్ విమర్శలు, ఫ్లకార్డుల ప్రదర్శనతో వైసిపి శ్రేణులు ఆగ్రహావేశాలకు గురయ్యాయనే సమాచారం ఉన్నా పోలీసులు సరైన రీతిలో స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. పైగా లోకేష్ పాదయాత్ర వెళ్లే మార్గంలో తాడేరు వంతెన వద్ద నుంచి టౌన్‌షిప్ వరకూ వైసిపి శ్రేణులు పెద్దసంఖ్యలో సుమారు గంట ముందు నుంచే మోహరించి ఉన్నా పోలీసులు స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి. ముందుగానే వారికి సర్దిచెప్పి పంపించేసి ఉంటే ఈ ఘటన చోటుచేసుకునేది కాదు. ఈ సమాచారం తెలిసి టిడిపి శ్రేణులు సైతం దాడిని ప్రతిఘటించడానికి సిద్ధమై రంగంలోకి దిగడంతో పరిస్థితి చేయిదాటింది. ఫలితంగా పలువురు పోలీసులతోపాటు టిడిపి శ్రేణులకు, స్థానికులకు, వైసిపి శ్రేణులకు గాయాలయ్యాయి. ఆపై వైసిపి కార్యకర్తల ఫిర్యాదు మేరకు టిడిపి నేతలతోపాటు యువగళం వాలంటీర్లపై కేసు నమోదు చేసిన పోలీసులు సుమారు 39 మంది యువగళం కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. టిడిపి నేతలను అరెస్టు చేయడంతోపాటు టిడిపి నేతల ఫిర్యాదు మేరకు వైసిపి శ్రేణులపైనా చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెబుతున్నారు. తుక్కులూరు, మందలపర్రు ఘటనలు ఎలాగున్నా భీమవరం ఘటనపై మాత్రం విచారణ జరగాల్సి ఉంది. లోకేష్ విమర్శలు ఘాటుగా ఉండొచ్చు. వాటిని ఖండించడమో, లేదో మరోరూపంలోనో తిప్పికొట్టొచ్చు. ఒకవేళ అదీకాదనుకుంటే లోకేష్‌పై పరువునష్టం దావా వేయొచ్చు. అయితే ఉన్న మార్గాలన్నింటినీ వదిలేసి విమర్శ, ప్రతివిమర్శ రాజకీయాల్లో సహజం అనే అంశాన్ని మరిచి భౌతిక దాడులకు తెగబడటం దిగజారుడు, ప్రతికారేచ్ఛ రాజకీయాలకు ప్రతిబింబమని చెప్పక తప్పదు. ఒకవిధంగా చెప్పాలంటే లోకేష్ ఆరోపణలను తిప్పికొట్టేలా బలమైన వాదన విన్పించడం మాని ఇలా ప్రతిదాడులకు దిగడం అంటే 'నిప్పు లేకుండా పొగ వస్తుందా' అనే చందంగా వాస్తవాలు ఎలాగున్నా లోకేష్ ఆరోపణలు నిజమేనేమో అనుకునే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకునైనా దుందుడుకు రాజకీయాలు మానుకుని ప్రజాక్షేత్రంలో ఆత్మవిమర్శ ధోరణితో ముందుకు సాగితే ఆయా రాజకీయ పక్షాలకే ఉపయోగకరమని పరిశీలకులు సూచిస్తున్నారు.

**లోకేష్ వంద రోజుల మంత్రం**

లోకేష్ ఆయా నియోజకవర్గాల్లో యాత్ర సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యలు, వివిధ తరగతుల ప్రజానీకంతో నిర్వహించిన ముఖాముఖీల్లో వచ్చిన వినతులపై నిర్దిష్టంగానే స్పందించారు. ఆయా ముఖాముఖీలు లేదా సభల్లో ఆయా సమస్యలు ప్రస్తావిస్తూ తాము అధికారంలోకి రాగానే కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కువ సమస్యలకు తాము అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో పరిష్కారం అనే మంత్రం ఎక్కువ జపించారు. నూజివీడు, చింతలపూడి, పోలవరం, ఉంగుటూరు, భీమవరం ఎంఎల్‌ఎలపై ఘాటైన విమర్శలు ఎక్కుపెట్టిన లోకేష్ ఉండిలో అధికార పార్టీ నేతలు, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాద్‌రాజు గురించి గాని నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది.

**వీడని విబేధాలు.. పట్టించుకోని అధినేతలు**

ఇక నూజివీడు, చింతలపూడి, పోలవరం, భీమవరం, నరసాపురంల్లో టిడిపి నేతల మధ్య విబేధాలు ఎక్కువగానే ఉన్నాయి. వాటి జోలికి వెళ్లకుండా లోకేష్ మౌనం వహించారు. జనాన్ని ఆకట్టుకోవడం ఒక ఎత్తయితే తమ నేతల మధ్య అనైక్యతను రూపుమాపకపోతే కచ్చితంగా ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. మరి అధిష్టానం దీనిపై ఎలా ముందుకెళ్తుందో వేచిచూడాలి. ఏదేమైనా లోకేష్ యాత్ర టిడిపి శ్రేణుల్లో జోష్ నింపిందనే చెప్పొచ్చు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

## ప్రజా సమస్యలపై సిపిఎం సమరభేరి

అధిక ధరలు, నిరుద్యోగం, భారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం సమరభేరి మోగించింది. ప్రధాన సమస్యలతోపాటు స్థానిక సమస్యలపైనా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించిన సిపిఎం శ్రేణులు పెద్దఎత్తున సంతకాల సేకరణ చేపట్టాయి. ఆపై ఆయా వినతులను సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టి అధికారులకు అందించారు. విమర్శలు, ప్రతిదాడుల్లో ప్రధాన రాజకీయపక్షాలు మునిగిపోతుండగా ప్రజా పోరాటాల రథసారధి సిపిఎం ఎప్పటిలానే పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలపై సమరభేరి నిర్వహించి వారి గొంతుకలా నిలిచింది. ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపించే సత్తా తమకే ఉందని ప్రత్యామ్నాయ రాజకీయాలకు కేంద్ర బిందువైన సిపిఎం మరోసారి చాటిచెప్పింది.

## రాజీయే రాజ మార్గం

ప్రజాశక్తి - కైకలూరు

రాజీమార్గమే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాస్‌లు తెలిపారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు కేసులు నమోదు చేసుకుని వారి విలువైన సమయం, ధనం వృధా చేసుకోవద్దన్నారు. విడాకుల కేసులపై ప్రస్తావిస్తూ వైవాహిక జీవితంలో చిన్న చిన్న మనస్పర్థలకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని, పెద్ద మనుషుల వద్ద రాజీపడే వాటికి చట్టబద్ధత ఉండదన్నారు. లోక్‌అదాలత్‌తో రాజీ పడితే మరెక్కడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. మూడు దశాబ్దాలకు పైగా నడుస్తున్న కేసులు ఇప్పటికీ కోర్టులలో ఉన్నాయని, రాజీ పడాలి అనుకునే వారికి లోక్ అదాలత్ చక్కని వేదిక అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం సత్యనారాయణ, మాట్లాడుతూ రాజీ పడటం వల్ల వాది ప్రతివాది ఇద్దరూ గెలిచినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజు, జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

**లోక్‌అదాలత్‌లో 500 కేసులు రాజీ**

**చింతలపూడి :** జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 500 కేసులు రాజీ అయినట్లు చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సి.మధు బాబు తెలిపారు. చింతలపూడి న్యాయస్థానంలో నిర్వహించిన జాతియలోక్ అదాలత్‌లో 472 క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు 8, కుటుంబ తగాదా కేసులు 3, చెక్ బౌన్స్ కేసులు 3, ప్రీ లిటిగేషన్ కేసులుగా బ్యాంక్ కేసులు 9, టెలిఫోన్ కేసులు 5 రాజీ చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని, చిన్న చిన్న తగాదాలు రాజీ చేసుకొనుట వల్ల విలువైన సమయము, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమయ్య, అడ్వకేట్ మెంబర్ కాకర్ల మాణిక్యాల రావు, అక్బర్ అలీ బ్యాంక్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

**జాతీయ లోక్ అదాలత్‌లో 887 కేసులు రాజీ**

**జంగారెడ్డి గూడెం :** జాతీయ లోక్ అదాలత్‌లో 887 కేసులు రాజీ అయ్యాయని లోక్ అదాలత్ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కెఎస్ఆర్ తేజస్వి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అచ్చుత శ్రీనివాసరావు, ఎవివి భువనేశ్వరి, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్

**నూజివీడు రూరల్ :** మండల పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని ఓటర్‌లిస్ట్ వెరిఫికేషన్ కొనసాగుతుందని మండల తహశీల్దార్ ఎల్లారావు తెలిపారు. నూజివీడులో శనివారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ నాటికి ఓటర్ లిస్ట్ తొలి జాబితా విడుదలవుతుందన్నారు. వెళ్లిపోయిన ఓటర్ల వివరాలు, మృతి చెందిన వారి వివరాలు, చిరునామా మార్పులు, చేర్పులు వంటి అంశాలను పరిశీలించి తుది జాబితా విడుదలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

## ఉపాధి శిక్షణా సంస్థ సేవలను వినియోగించుకోవాలి

**భీమడోలు :** గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి సౌకర్యాలను కల్పించే క్రమంలో సత్రంపాడు కేంద్రంగా పనిచేస్తున్న యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ సేవలను వినియోగించుకోవాలని భీమడోలుకు చెందిన స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్ సింగ్ కోరారు. స్వయం ఉపాధిలో భాగంగా జ్యూట్ బ్యాగ్స్, స్టాఫ్ టాయ్స్ మేకింగ్‌లో 13 రోజులపాటు ఉచిత శిక్షణను సంస్థ అందజేయనుందన్నారు. ఈ శిక్షణా తరగతులు సెప్టెంబర్ 11వ తేదీన ప్రారంభమవుతాయన్నారు. వీటిలో చేరేందుకు కనీస విద్యార్హత 5వ తరగతి, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్కులు దీనిలో చేరవచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. శిక్షణ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం, శిక్షణ ఇచ్చిన యూనియన్ బ్యాంక్‌కు చెందిన సంస్థ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. దీని ఆధారంగా యూనిట్ల స్థాపనకు అవసరమైన రుణ సౌకర్యం కోసం బ్యాంకులను సంప్రదించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 9948565256 లేదా 9502723561 ఫోన్ నెంబర్లతో సంప్రదించాలని కోరారు. సంస్థకు చెందిన కోడ్ లేదా లింక్ ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## 'ఆరోగ్యశ్రీ'పై అవగాహన అవసరం

**ఆగిరిపల్లి :** ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం మీద అవగాహన కల్పించడంతో పాటు, కుటుంబంలో అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి, వారికి సత్వరమే వైద్య సదుపాయం అందజేయడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి-2 ఎస్‌కె.టీనా తెలిపారు. ఆగిరిపల్లి పిహెచ్‌సిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సూపర్ వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పి, ఆశావర్కర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్స్ తమ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కలిగించాలన్నారు. దీంతో పాటుగా ఆ కుటుంబంలో వున్న సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై ప్రాథమిక పరీక్షలు నిర్వహించటంతో పాటు అవసరమైన వారిని జగనన్న సురక్ష శిబిరానికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి-1 జె.జగన్మోహనరావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

## శ్యామ్‌చంద్రశేషుకు పిహెచ్‌డి పట్టా

**జంగారెడ్డి గూడెం :** స్థానిక టిడిపి నాయకులు దాసరి శ్యాం చంద్ర శేష ఆంధ్రా యూనివర్సిటీ కాన్విక్షేషన్‌లో పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. శనివారం వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన 87, 88, 89, 90వ కాన్విక్షేషన్‌లో జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంకి చెందిన డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేష న్యాయశాస్త్రంలో 'రైట్ టూ ఎన్విరాన్‌మెంట్ లా అండ్ పాలసీ పెర్స్‌పెక్టివ్' అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు లభించిన పిహెచ్‌డి పట్టాను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శేష మాట్లాడుతూ న్యాయశాస్త్రంలో పిహెచ్‌డి పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అప్ ల్యాండ్ ఏరియాలో తనకు సహకరించిన గురువు ఆచార్య సూర్యప్రకాశ్ రావుకు, కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

### నేరాలు - ఘోరాలు

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

**నూజివీడు రూరల్ :** మండలంలోని సుంకొల్లు గ్రామములోని ఈదుల చెరువు వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న గంగుల గంగరాజు(44)ను శనివారం ట్రాక్టర్ ఢీ కొట్టడంతో గంగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## విద్యుదాఘాతంతో వ్యకి దుర్మరణం

**మండవల్లి :** భారీ విద్యుత్ షాక్ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి శనివారం దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన బుద్దేశ్వర డోలే(35) అనే వ్యక్తి బతుకు దెరువు నిమిత్తం వచ్చి కొర్లపాడులో నివాసం ఉంటూ మండవల్లి గ్రామానికి చెందిన మెండ సురేష్‌కు చెందిన రొయ్యల చెరువుపై గత 15 రోజుల నుంచి కాపలాదారుడుగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో రొయ్యల చెరువులోని ఫ్యాన్సుట్లకు రాడ్ బిగించ నిమిత్తం పొడవాటి పైపును భుజం మీద వేసుకుని వెళుతుండగా చెరువుగట్టుపై ఉన్న 33 కెవి భారీ విద్యుత్ తీగలకు బుద్దేశ్వర డోలే భుజంపై ఉన్న పొడవాటి పైపు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రసారమై, షాక్ కొట్టడంతో అక్కడికక్కడే క్రింద పడిపోయాడు. అక్కడున్నవారు గమనించి బుద్దేశ్వర డోలేను వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుడు అన్నయ్య మనోజ్ డోలే ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, బంధువులకు అప్పగిస్తామని ఆయన తెలిపారు.

## నాటుసారా స్థావరంపై దాడి
### వ్యక్తి అరెస్టు

**చింతలపూడి :** సారా స్థావరంపై దాడులు చేసినట్లు ఎస్ఇబి సిఐ సాయి స్వరూప్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో చింతలపూడి సబ్ సిబ్బంది నాగిరెడ్డి గూడెం గ్రామంలో నాటుసారా స్థావరంపై దాడి నిర్వహించి ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 600 లీటర్ల పులిసిన బెల్లపుఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్టు తెలిపారు. ఇతనికి సారాయి తయారికి ఉపయోగించు ముడి పదార్థమైన బెల్లంను సరఫరా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## నగదు రహిత లావాదేవీలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

నగదు రహిత లావాదేవీలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. స్థానిక బిసి కాలనీలో సచివాలయం కన్వీనర్ బుంగ రాణి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యతలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకంతో పాటు అటల్ ఫించన్ యోజన పథకాలను ప్రతిఒక్కరూ కలిగి ఉండాలన్నారు. పేద వర్గాలకు చెందిన వారందరూ పిఎం ఆర్థిక భరోసా పథకాలు వినియోగించుకొని కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంకు మిత్ర పాయింట్లు, ఎటిఎం సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ బ్యాంకు అందిస్తున్న సేవలపై అవగాహన కలిగేలా గ్రామాలలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, పి.లక్ష్మీ కుమారి, కె.విజయ కుమారి, ఎం.వెంకటరమణ, జి.చిట్టెమ్మ, ఎన్.వరలక్ష్మి, ఆర్.నాగలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బీమాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్

## ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జగన్మోహనరావు

ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకొనవచ్చునని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి జె.జగన్మోహనరావు తెలిపారు. పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం వలన దోమలను నివారించవచ్చునని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి, వేడి ఆహారపదార్థాలను తీసుకోవాలని తెలిపారు. జ్వరం కానీ ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గానీ వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌లకు సంబంధించిన ర్యాపిడ్‌టెస్టులు, ఇతర అన్ని సాధారణ పరీక్షలు అందుబాటులో వున్నాయన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాలను సద్వినియోగ పర్చుకోవాలని కోరారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎంతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సన్మానించుకోవడం గొప్ప సాంప్రదాయంగా గుర్తించాలని స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఇ.కృష్ణ ప్రసాద్ తెలిపారు. పట్టణంలో ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఎంఇఒ గోవిందరావు, పదవీ విరమణ చేసిన తెలుగు ఉపాధ్యాయులు ఈమని శేషయ్యను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవిబాబు, కొంపల్లి అనంతలక్ష్మి, కొప్పుల రంగారావు పాల్గొన్నారు.

**పార్లమెంట్ సమావేశాల్లో**

## 'ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి'

ప్రజాశక్తి - చింతలపూడి

ఈనెల 18న నిర్వహించే పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకురాలు చవటపల్లి విజయ మాదిగ తెలిపారు. పట్టణంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు పిలుపు మేరకు నిరసన కార్యక్రమం ఎంఎస్‌పి మహిళా కన్వీనర్ కొలికిపాము హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన, టిడిపి నాయకులు కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త చౌటుపల్లి విజయ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి 59 ఉప కులాలకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తలపెట్టిన 29 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమానికి ఎబిసిడి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో

ప్రవేశపెట్టాలని ఆమె కోరారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు వర్గీకరణ బిల్లుకు సంఘీభావం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ జోసెఫ్ తంబి, ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సొంగ నక్షత్రం, రాష్ట్ర నాయకురాలు నమ్మిన లక్ష్మి, జిల్లా ఇంఛార్జి నమ్మిన నాగార్జున, ఎంఆర్‌పిఎస్ చింతలపూడి నియోజకవర్గ మహిళా కన్వీనర్ గొల్లపల్లి సౌజన్య, కోకన్వీనర్ చౌటపల్లి అరుణ, ఎంఎస్‌పి జిల్లా నాయకురాలు జుజ్జువరపు మేరీ పాల్గొన్నారు.

## సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత : మానవత

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యావ్యాప్తికి, ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి, ప్రభుత్వ వైద్యశాలలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని సంస్థ జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఇన్ పేషెంట్లు సౌకర్యార్థం అధునాతన వసతులతో కూడిన రూ.35 వేల విలువగల బెడ్‌ను కైకరంకు చెందిన దాత శానం పెదబాబు భీమడోలు మానవత శాఖ ద్వారా శనివారం ఆరోగ్య కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా జరిగే ప్రసవాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పసిపిల్లల వైద్యం కోసం కొన్ని అదనపు సౌకర్యాలు కావాలని మానవత శాఖ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన మానవత భీమడోలు శాఖ పసిపిల్లల వైద్యానికి అవసరమైన బేబీ వార్మర్, ఇంక్యుబిలేటర్, ఇతర సౌకర్యాల కల్పనకు రూ.65 వేల కేటాయింపు సంసిద్ధతను వెల్లిబుచ్చారు. ఈ నేపథ్యంలో స్పందించిన సంస్థ భీమడోలు శాఖ డైరెక్టర్ కేతినీడి విశ్వేశ్వరరావు తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సౌకర్యాల కల్పనకు ముందుకు వచ్చిన దాతలను భీమడోలు మానవత శాఖ సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపితో పాటు భీమడోలు, ఉంగుటూరు మండలాలకు చెందిన మానవత శాఖల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుపై టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చింతలపూడి నియోజకవర్గ మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలు పట్టుకొని నిరసన ర్యాలీ స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో యాళ్ల లీలా ప్రశాంతి, బొమ్మాజి అనిల్, సొంగా రోషన్ కుమార్, మాటూరు వెంకట్రామయ్య, కొండ్రు దేవా, పక్కాల వెంకటేశ్వరరావు, బోడ నాగభూషణం, బోడా అనిష్ కుమార్ పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి :** టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఎస్ఐ చంటిబాబుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటేశ్వరరావు, శివరామకృష్ణ, మంగయ్య, శ్రీనివాసరావు, వేణు, దావీదు, వంశీ, కొండలరావు, ఏసుపాదం, సాంబశివరావు, సత్యకుమార్, శ్రావణ్‌లు పాల్గొన్నారు.

**ముసునూరు :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు ఖండిస్తూ మండల కేంద్రమైన ముసునూరులో కొండేటి బాబి, గద్దల మోహనరావు, గుడపాటి విజయ్, పాకనాటి సీతారామ్, తోట శ్రీనివాసరావు, పాకనాటి సీతారామాంజనేయులు, జాన్, గారపాటి నరసింహారావు, నక్కా యోహాన్, చింతా రాంబాబు, ఆటో సాంబయ్య, గుడిపాడులో గద్దే రఘుబాబు, మందలపు ధర్మరాజు, వలసపల్లిలో మెదరమెట్ల సురేంద్ర, చింతలవల్లిలో పర్వతనేని గంగాధరరావు, కాట్రేనిపాడులో రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల సత్యనారాయణ, గద్దల మోహనరావు, గుడపాటి అజయ్, సూర్యదేవర శ్రీనివాసరావు, చెక్కపల్లిలో కాటేపల్లి సత్యనారాయణ, సూరేపల్లిలో మల్లిబాబు, సత్యనారాయణ, రమణక్కపేటలో రంగవాసు, చిల్లబోయినపల్లిలో బుజ్జిల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, మండల నాయకులు రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణలను హౌస్ అరెస్టు చేసినట్లు ఎస్ఐ యం.కుటుంబరావు తెలిపారు.

**టి.నరసాపురం :** మండలంలోని తిరుమలదేవి పేటలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో షాపులను మూయించి, ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. మక్కినవారిగూడెంలో టిడిపి మండల కార్యదర్శి ఆచంట అనిల్ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో రోడ్డుపై బైటాయించి నాయకులు నిరసన తెలిపారు. మండల టిడిపి ఆధ్వర్యంలో టి.నరసాపురం హైస్కూల్ వద్ద మూడు రోడ్ల కూడలిలో టిడిపి జెండాలతో ధర్నా నిర్వహించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండించారు. షాపులను మూయించి బంద్ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ముందుగానే టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరావు, టిడిపి మండల కార్యదర్శి నాయుడు రామకృష్ణారావు గౌడ్‌లను హౌస్ అరెస్టు చేశారు. ఈ కార్యక్రమాలలో టిడిపి నాయకులు కొండపల్లి రవి, బొంతు సత్యనారాయణ, ఆచంట సూర్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ, కాళ్ళీడి రాంబాబు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి :** నారా చంద్రబాబు నాయుడు అరెస్టుపై టిడిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జీలుగుమిల్లి జాతీయ రహదారిపై టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన కారులను అడ్డుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, ఎంపిటిసి నాలి శ్రీను, టిడిపి అధ్యక్షులు సాంబ, నాగేశ్వరావు, మాజీ జడ్‌పిటిసి పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్ :** నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 20 మందిని హౌస్ అరెస్టు చేసినట్లు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ నూజివీడు, ముసునూరు మండలం గోగులంపాడు, చిల్ల బోయినపల్లి సబ్ డివిజన్

చింతలపూడిలో రోడ్డుపై నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు..

పరిధిలోని దెందులూరు ప్రాంతాలలో కొందరు బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోనికి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయ పరిణామాల దృష్ట్యా శాంతి భద్రతలకు కృషి చేస్తున్నామన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నూజివీడులో టిడిపి శ్రేణులు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ధర్నా చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు పార్టీ కార్యకర్తలతో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పట్టణ సిఐ మూర్తి సిబ్బందితో కలిసి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిడిపి కార్యకర్త తన వాహనానికి తానే నిప్పంటించుకున్నాడు. పోలీసులు మంటలను ఆర్పి వేశారు.

**చాట్రాయి :** ఏ ఆధారాలు లేకుండా తప్పుడు నోటీసులు ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయటం అన్యాయమని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన నివాస స్థలం రోడ్డుపైనే తన అనవసరులతో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రమైన చాట్ రైలు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. కోటపాడు గ్రామంలో శనివారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జగన్, సజ్జల దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మరిడి వెంకటేశ్వరరావు, ఎర్రోజు రాంప్రసాద్, పలగాని దుర్గారావు, బొట్టు రామచంద్రరావు పాల్గొన్నారు.

**ఏలూరు అర్బన్ :** చంద్రబాబు అరెస్టుకు ఏలూరులో పలుచోట్ల నిరసనలు జరిగాయి. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురు నిరసనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం పాత బస్టాండ్ సమీపంలోని బడేటి క్యాంపు కార్యాలయంలో ఏలూరు టిడిపి అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జి బడేటి రాధాకృష్ణయ్య, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబును పోలీసులు అరెస్టు చేసి 3-టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో వందలాదిగా కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు తరలిరావడంతో 3-టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ పోలీసులు అరెస్టు చేసిన వారిని స్టేషన్‌లోనే ఉంచారు. అలాగే ఏలూరు టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక వసంత మహల్ సెంటర్‌లోనూ, తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లోనూ నిరసనలు చేయగా టిఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి, వివిధ స్టేషన్‌లకు తరలించారు. ఆర్‌ఆర్ పేటలో టిడిపి కార్యకర్తలు బంద్ నిర్వహించి, పలు దుకాణాలు మూయించగా వారిని సైతం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**పోలవరం :** టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులను, కార్యకర్తలను పోలవరం పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు పివివి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, ప్రగడపల్లి సర్పంచి బాపిరాజు, సబ్బారపు శ్రీరామ చంద్రమూర్తి, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

**కైకలూరు :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టును నిరసిస్తూ కైకలూరులో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఉదయమే అరెస్టు విషయం తెలిసిన నాయకులు మాగంటి నివాసంలోని టిడిపి కార్యాలయంకు చేరుకున్నారు. మాజీ జడ్‌పిటిసి సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మిని గృహ నిర్బంధం చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

**కలిదిండి :** చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం దారుణమని టిడిపి శ్రేణులు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ రాష్ట్రీయ రహదారిపై నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజును కలిదిండిలో గృహనిర్బంధం చేశారు. ఆయన ఇంటి వద్ద టిడిపి శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు.

**జంగారెడ్డిగూడెం :** టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ స్థానిక టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం నుంచి స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. అలాగే నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందించి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరికృష్ణ, మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, కార్యదర్శులు తూటికుంట రాము, కుక్కల మాధవరావు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, పాతూరి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ మండలంలోని తాడువాయిలో రాష్ట్రీయ రహదారిపై టిడిపి శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. శనివారం మధ్యాహ్న సమయంలో రాష్ట్ర రహదారిపై బైఠాయించిన పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు ఎస్ఎస్ ఇస్మాయిల్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శనివారం ఉంగుటూరులో కార్యకర్తలు, నాయకులు జాతీయ రహదారిపై ధర్నా చేయబోతే చేబ్రోలు పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పలువురు నాయకులను ఇంటి వద్దే అదుపులోకి తీసుకుని తెల్లవారుజామునే స్టేషన్‌కు తరలించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలని జనసేన నాయకులు పత్సమట్ల ధర్మరాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధ్వజమెత్తారు.

**మండవల్లి :** చంద్రబాబు అరెస్టుకు నిరసన వ్యక్తం చేస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం మండవల్లిలో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనను అడ్డుకుని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో మండల పార్టీ అధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, గొల్లపూడి సత్తిబాబు, చావర్తన విజయ్, గడిదేసి విజయ్ పాల్గొన్నారు.

**ముదినేపల్లి :** చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం మండలకేంద్రమైన ముదినేపల్లిలో టిడిపి నాయకులు ఆందోళనలు చేశారు. కె.వినోద్ ఆధ్వర్యంలో వందమందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కొడాలి వినోద్ నివాసం నుంచి బయలుదేరి వైకుడలికి చేరుకున్నారు. అక్కడ ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పించేందుకు వినోద్ పూలదండ వేయబోగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, టిడిపి కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాటలు, వాగ్వివాదాలు జరిగాయి. పోలీసులకు, కార్యకర్తలకు మధ్య జరిగిన పెనుగులాటలో వినోద్ చొక్కా చిరిగిపోయింది. పరిస్థితి విషమించడంతో కైకలూరు, మండవల్లి మండలాల నుంచి పోలీసులు పెద్దఎత్తున చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. పామర్రు - దిగమర్రు 165 రహదారిపై జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

## పలు పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**ఏలూరు :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో ఈ క్రింది తెలిపిన పోస్టులకు ఒక సంవత్సర కాలమునకు భర్తీ చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.శర్మిష్ట ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 మెడికల్ ఆఫీసర్(కాంట్రాక్ట్ బేస్), 25 స్టాఫ్ నర్స్ (కాంట్రాక్ట్ బేసిస్), 10 ఫార్మసీస్ట్(కాంట్రాక్ట్), 4 లాక్టీషియన్(కాంట్రాక్ట్ బేసిస్), 6 డేటా ఎంట్రీ ఆపరేటర్(ఔట్ సోర్సింగ్), 12 నాల్గవ తరగతి ఉద్యోగి/లాస్ట్ గ్రేడ్ సర్వీస్(ఔట్ సోర్సింగ్) మొత్తం 68 పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు https://westgodavari.ap.gov.in, https://eluru.ap.gov.inను సంప్రదించాల్సిందిగా తెలియజేశారు.

## కొండచిలువ హతం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని వెంకటాద్రిపురంలో వారం రోజులుగా కోళ్లను పట్టి తింటున్న కొండచిలువను శనివారం గ్రామస్తులు చంపివేశారు. వారం రోజులుగా కంటిమీద కునుకు లేకుండా ఇబ్బంది పెడుతున్న కొండచిలువను స్థానికులు ప్రొక్లైన్ సహాయంతో చంపారు. గ్రామంలో ఖాళీ స్థలాలను ప్రొక్లైన్‌తో చదును చేస్తూ ఉండగా కొండచిలువ బయటపడటంతో దానిని చంపేశారు.

## విఆర్‌కు ఎస్ఐ సాగర్‌బాబు

**జంగారెడ్డి గూడెం :** స్థానిక ఎస్ఐ ఎం.సాగర్ బాబును విఆర్‌కు బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఏలూరు విఆర్ నుంచి మల్లికార్జున రెడ్డిని జంగారెడ్డిగూడెం ఎస్ఐ గా బదిలీ చేసిన పోలీస్ ఉన్నతాధికారులు స్థానిక ఎస్సై సాగర్ బాబును ఏలూరు విఆర్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

## ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడి జడ్‌పి హైస్కూల్లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎంపిడిఒ వివి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆటల పోటీల వలన పోటీతత్వం పెరుగుతుందని, ఐక్యమత్యం అలవడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం హనుమంతరావు, ఎంపిటిసి భాష, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దర్భగూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దర్భగూడెంలో స్థానిక పరెడ్డి వెంకాయమ్మ వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం రాజా హాస్పటల్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ఏజెన్సీ గ్రామాల నుంచి పలువురు రావడంతో వారికి పలు రకాల పరీక్షలు చేసి, మందులు ఇచ్చినట్లు వైద్యాధికారులు రాజా, సుష్మ తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, ఉప సర్పంచి కె.రాఘవ రెడ్డి, చౌదర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సిలపరెడ్డి పాల్గొన్నారు.

## ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

**నూజివీడు రూరల్ :** నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంఎంఇ బ్రాంచ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు 10 మంది ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ ఛైర్మన్ ఆచార్య జివిఆర్ శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. వీరందరూ కాకినాడలోని శ్రీభవాని కాస్టింగ్ లిమిటెడ్‌లో సంవత్సరం పాటు ఇంటర్న్‌షిప్ చేస్తారన్నారు. ఆ కాలంలో కంపెనీ వారికి నెలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు స్టైఫెండ్ చెల్లిస్తుందన్నారు. ఎంపికైన వారిని డైరెక్టర్ ఎఐ ప్రదీప్, బోధనా సిబ్బంది అభినందించారు.

## ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

**జీలుగుమిల్లి :** తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో శనివారం సర్పంచి సున్నం వరలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ శిక్షణా శిబిరం మూడు నెలల పాటు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ సభ్యులు శివ గణేష్, వనమా రామకృష్ణ, మమత, నాగరాజు, వెంకటరమణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**రెండు పాస్‌పోర్టులు పడిపోయినవి**

పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలం, గుమ్ములూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు, తండ్రి: మసేన్ రావుకు చెందిన **S9921972**, అతని భార్య దాసరి మహాలక్ష్మి, భర్త: దాసరి శ్రీను కు చెందిన **L9293284** నెంబర్లు గల రెండు పాస్‌పోర్టులు ది.26-05-2023వ తేదీన ఇరువురు గుమ్ములూరు నుండి పాలకొల్లు ఆటోలు వెళుతుండగా రెండు పాస్‌పోర్టులు కలిగిన బ్యాగ్ మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

**దాసరి శ్రీనివాసరావు**
తండ్రి: మసేన్ రావు, డో.నెం.4-68, మంగలి వీధి, గుమ్ములూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్ నెంబర్ : 534267. సెల్: 87909 54441